ఊహలు
తారుమారయి
భర్తే
జీవితానికి
విలన్‌గా మారితే
ఆ భార్య ఏం చేసింది?

శ్రీమతి
ఎస్.హరిప్రియ
కథ

# తెగింపు

ప్రస్తుత యధార్థ జీవన పరిస్థితుల్ని విస్మరించి భవిష్యత్ జీవితం గురించి ఊహా లోకంలో ఆశాసౌధాలు నిర్మించుకుంటూ సుఖమయ జీవితం అనుభవించే ప్రాప్తం ఉన్నాలేకున్నా మనసున జిలిబిలి కోర్కెలు అల్లిబిల్లిగా నిర్మించుకుంటూ సుఖాల సరస్సులో తేలియాడుతూ తీయని మధురోహల ఊయల లూగుతూ ఆనందానుభూతుల్ని పొందుతున్నట్లు తృప్తిపడుతూ జీవన మనుగడ సాగించటం మానవజన్మకు సహజ లక్షణం.

జీవితవలయంలో అనేక చిక్కు సమస్యల పోరాటంతో సతమతమౌతూ అందిన వరకూ అనుభవిస్తూ అందని వాటికోసం అర్రులు చాస్తూ అందుకోవాలని కలలుకంటూ కాలచక్రాన్ని దొర్లిస్తుంటారు. ఈ సమస్యా పరిష్కారంలో కొందరు విజేతలౌతుంటారు. కొందరు పరాజితులౌతూంటారు. పరాజయం పొందుతారనటానికి ప్రత్యక్ష నిదర్శనం తన జీవితమే.

పసితనంనుండీ నందనోద్యానవనంలో తుళ్ళూతూ తేలుతూ మయూరంలా బతికిన తన జీవితం ముందుముందు కూడా పూలబాటేనని ఎన్నో కలలుగని మరెన్నో ఆశలు పెంచుకొంది. స్వేచ్ఛా విహంగంలా కోర్కెల ఆశలు రెక్కలువిప్పుకుంటున్న తరుణంలో వైవాహిక సంఘటనతో కర్కశంగా ఆడుకున్న విధి తన కోర్కెల రెక్కల్ని నిర్దాక్షిణ్యంగా ఖండించివేసి తన ఆశల్ని సమూలంగా సమాధి చేసింది. బతుకు



బరువుగా, విసుగ్గా ఉంటూంది. జీవితమంటే నిర్లిప్తతా, నిరాశా ఆవహించాయి. ఏ కొండలపైకో అడవులలోకో వెళ్లి ఏకాంతంగా తపస్సు చేసుకోవాలని యోగినిలా ముక్తిమార్గం అన్వేషిస్తూ ఐహికజీవితాన్ని గాలించాలని అనిపిస్తూంది. ఉన్నపాటున ఏ రాయిగానో మ్రానుగానో మారిపోవాలనిపిస్తూంది. ఒకప్పటి

కోర్కెలకూ, ఇప్పటి కోర్కెలకూ ఎంత తేడా?

ఒకప్పుడు నిరాశా నిస్పృహలంటే చిరాకు. చావంటే అసహ్యం. ఎవరైనా బాధలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని విన్నా చూసినా జీవితంతో రాజీపడటంచేతకాని భీరువులనుకునేది. బ్రతుకును సూటిగా ఎదుర్కొనే ధైర్యంలేని పిరికి సందలనుకునేది ఇప్పుడు?.... ఇప్పుడది తనకు అత్యంత సమీపంలో ఉన్న మనసును చుట్టుముట్టిన భావావేశాలు. అయినా... మిణుకు మిణుకుమనే గోరంత దీపంలాంటి ఏదో ఆశ... ఎందుకోసమో నిరీక్షణ... తనేమీ రాజకుమారుడు లాంటి భర్తకావాలనీ, మన్మథుడ్నితలదన్నే అందగాడు కావాలనీ, మహారాణిలా రాణీవాసం చేయాలని అందలంఎక్కి కూర్చోవాలనీ ఆశాసౌధాలు కట్టుకోలేదు. తనను తానుగా గుర్తించి భార్యగా అర్థంచేసుకుని తన గుండెల్లో పదిలంగా దాచుకునే మనసున్న మనిషి భర్తగా లభించి ఆద్యంతమూ మనశ్శాంతితో ఆత్మ సంతృప్తితో బ్రతుకగలిగితే చాలనుకుంది...

పెళ్లి చూపులు మొదటిసారైనా బెరుకులేకుండా హుందాగా కూర్చోవటానికి ప్రయత్నించింది గాని కూర్చోగానే తెలియని భయంతో ఒళ్లంతా చిరుచెమట పోయసాగింది. వచ్చిన వాళ్లేవో అడిగిన యక్ష ప్రశ్నలకు వినయంగానే సమాధానం చెప్పింది. వాళ్లంతా కబుర్లలో పడగానే ఒక్కసారి తలెత్తి ఓరగా అతన్ని చూసింది.

చూడగానే ఆకర్షించి ఆకట్టుకునే స్ఫురద్రూపి. ముఖంలో రాజసం ఉట్టిపడుతూంది. అతనితో వివాహం జరిగితే తను నిజంగా అదృష్టవంతురాలే. అతని నీడలో, సాహచర్యంతో తన బ్రతుకుసంది బంగారు పూల తేరు కాగలదని మురిసింది. తన ఊహలకు మించిన భర్త దొరకటం పూర్వజన్మ సుకృతం అని తలపోసింది. అతని సరసన తన స్థానం ఊహించుకుంటేనే పరవశం కలగసాగింది. ఆ ఆనందానుభూతుల నుండి తేరుకోకముందే అతని అర్ధాంగి అయింది.

అనుకున్న ఒప్పందం ప్రకారం కట్నకానుకలు, లాంఛనాలు ఘనంగా అందించి మాట నిలబెట్టుకున్నారు పుట్టింటివాళ్లు. ఆ ఆనందాబ్ధిలో ఓలలాడుతూ తనెప్పుడో సరదాగా అప్లయి చేసిన... తన క్వాలిఫికేషన్స్‌కి ప్రాధాన్యత నిచ్చి అంతకుమించి తన మీద ఉన్న అభిమానంతో ఉద్యోగంలో చేరమని ఆర్డర్ పంపిన ప్రైవేటు కంపెనీ ఓనర్, తనకు సీనియర్ స్టూడెంట్ మనోహర్ ఆహ్వానాన్ని తిరస్కరించింది.

నవ వధువుగా భర్తగా తన మీద సర్వాధికారాలూ చేజిక్కించుకున్న మాధవ్ పరిష్వంగంలో మైమరచి తనివి తీరకముందే అతనొక స్వార్థపరుడనీ సమయానుకూలంగా ప్రవర్తించే కుటిలుడనీ గ్రహించి గుండె రాయిలా బిగుసుకుపోయింది. అందం, ఆకర్షణతోపాటు హృదయ సంస్కారం కూడా ఉందనీ తన జీవితంలోకి అదృష్టం ప్రవేశించిందని భ్రమ పడింది గాని

దురదృష్టం అడుగు పెట్టిందని అనుకోలేకపోయింది.

తన మనసులో మాట చెప్పుకునే అవకాశం, ఆస్కారం, చనువూ, స్వాతంత్ర్యం తనకు లేవు. అతని మనసులో అభిప్రాయం తనకు చెప్పడు. చెప్పినా అది నిజంకాదు. అతను చెప్పిందే నిజమని నమ్మి శిరసావహించాలి. మనసు ఏడుస్తున్నా ముఖం నవ్వుతూ వుండాలి. తనకే లోటూ లేనట్లు అతను లోపం చేస్తున్నట్లు ఇతరులకు కనిపించకుండా నమ్మిస్తూ, నటిస్తూ సహజీవనం సాగించాలి. తన అవసరాలకు యంత్రంలా ఉపయోగపడాలి.

తేనెలూరే తియ్యనిమాటల్తో మెత్తగా మనసును కోస్తుంటాడు. ఊహాలోకాలకూ, స్వానుభవానికీ ఎంతదూరం? ఎంత వ్యత్యాసం? ఊహాలోకం అందమైన హరివిల్లు లాంటిదైతే స్వానుభవం అధఃపాతాళానికి అణగద్రొక్కే నరకంలాంటిది. కాలంతోపాటు తరిగిపోతున్న రూపాయి విలువ కారణంగా అతని దృష్టిలో తను తెచ్చిన కట్నకానుకలు స్వల్పరూపుదాల్చుతూ అది క్రమేణా పెరుగుతూ ఏదో ఒక రూపేణా బాధిస్తూనే ఉన్నాడు. ధన దాహం అతన్ని శాడిస్ట్‌గా మారుస్తూంది.

దీనికి బాధ్యులెవరు? ముక్కూ ముఖం తెలియని మాతన వ్యక్తి బాహ్య రూపానికి విలువనిచ్చి అంతఃకరణ లోతుపాతులు తెలుసుకోకుండా పెళ్లిచేసిన పెద్దలదా? అంతఃసౌందర్యం గురించి ఆలోచించకుండా బాహ్య సౌందర్యానికి మురిసి తలవంచిన తనదా? ఎవరిది? ఇవి జవాబు దొరకని ప్రశ్నలు. స్త్రీ జీవితం మీదే అపహ్యాం వేసింది. అతనెన్ని బాధలు పెడుతున్నా సహించగలుగుతూంది గాని ధనదాహం తీర్చలేక తల్లడిల్లిపోతూంది. కాపురం చిన్నాభిన్నమౌతుందేమోనని భయంతో తమ శక్తి కొలదీ అతని ధనదాహం తీరుస్తూనే ఉన్నారు పుట్టింటివారు. అది అలుసుగా తీసుకుని మరీ ఊచకోత కోస్తున్నాడు.

ఏనాటికైనా తన తప్పు తెలుసుకుని మనిషిగా అర్థం చేసుకోలేకపోతాడా? అనే ఆశ అడుగంటిపోతూంది.

ఇలా ఎంతకాలం? ఎన్నాళ్లు? ఎన్నేళ్లు? ఎంతకని పుట్టింటిని దోచుకురావటం? దీనికి అంతం ఎప్పుడు? ఆడదాని వ్యధలకు



ఒక మహిళా సభలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూన్న సభ్యురాళ్ళతో విసుగెత్తి "వీళ్ళని నిశ్శబ్దంగా ఉంచాలంటే ఏం చెయ్యాలి?" అంది అధ్యక్షురాలు.

"మీలో వయసు మీరిన వారు మాత్రమే మాట్లాడండి— అంటూ ఒక ప్రకటన చెయ్యండి! వెంటనే ఫలితం కన్పిస్తుంది!" అన్నది కార్యదర్శి.

—జోకర్ (హైదరాబాద్)

విముక్తి ఎప్పుడు? ఆడది... అబల... జంట పదవుల్లాంటివి. ఆడది విద్యాధికురాలై ఉండీ స్వశక్తిపై బ్రతక గలిగివుండీ ఒంటరిగా ఎందుకు బ్రతకలేక పోతూంది? ఎన్ని పదవులున్నా ఎన్ని సంపదలున్నా మగవాడినే ఆధారంగా చేసుకుని ఎందుకు బ్రతుకుతూంది?

"భర్త ఎలాంటివాడైనా అతని ఆలంబనలో బ్రతకటమే స్త్రీకి విలువ, గౌరవం, భద్రత" ఇదీ సమాజం చెప్పే సమాధానం. సంఘం వెలిబుచ్చే అమూల్యాభిప్రాయం. ఆ కట్టుబాట్లను అతిక్రమించిననాడు ఆ సమాజమే తప్పు మగాడిదైనా "పతిత" "రాక్షసి" అనే ఉచిత బిరుదులు ఆడదానికే అంకితం చేస్తుంది. ఆపాదిస్తుంది. అవమానిస్తుంది. చచ్చేంతవ రకూ మళ్లీ బీదుస్తుంది. భర్తత్యజించిన స్త్రీకి గాని, భర్తను త్యజించిన స్త్రీకి గాని రక్షణ, ఆవరణ అనేవి శూన్యపదాలు. అందుకు ధైర్యంచేసి నిలబడగలగాలంటే డబ్బు కోటగోడలా నిలవాలి. ఈ నరకయాతన భరించలేకనే ఎన్నోసార్లు ఆత్మహత్యకు పాల్పడి విధి చేతిలో కూడా ఓడిపోయింది. ఈ రోజు ఉదయం బైటికి వెళుతూ కఠినంగా ఆజ్ఞాపించి వెళ్లాడు.

"డబ్బు అత్యవసరం. అర్జంటుగా వెళ్లి తీసుకురమ్మ"ని.

స్వతంత్రించి రూపాయి సంపాదించటం చేతకాని ఇలాంటి ప్రబుద్ధుల నోటినుండి వెలువడే అతితేలికైన పదం అదే! ఇలాంటి ప్రబుద్ధుల చేతిలో పడే రూపాయి విలువ తరిగిపోతూందేమో కూడా!

అలా ఆజ్ఞ జారీ చేసినప్పుడల్లా వెంటనే వెళ్లి వీలైనంతతెచ్చి సమర్పించవలసిందే. అలా అడిగినప్పుడల్లా తెచ్చి అందించినదంతా తమ తాహతుకు మించిపోయి పుట్టింటి వాళ్లు అప్పులపాలై పతనావస్థకు చేరుకున్నారు. వాళ్లను ఎప్పటికప్పుడు నిలువుదోపిడీ చేసినట్లవుతూంది. అలా పీడించి తేవటం చాలా సిగ్గుగా,అవ మానంగా, అసహ్యంగా కూడా ఉంటూంది. అయినా ఎప్పటికప్పుడు తప్పటంలేదు. రేపిపాటికి అతనికి డబ్బైనా ఇవ్వాలి. సరైన సమాధానమైనా చెప్పాలి. ఆకలిగొన్న క్షుద్ర దేవతకు కొద్దికొద్దిగా ఎన్నిసార్లు నైవేద్యం పెట్టినా ఆకలి తీరదు. అలాంటి ఆకలిగొన్న గ్రహమే తన భర్త.

ఒక్కసారిగా కుంభంపోసే శక్తి తనవాళ్లకులేదు. ఏదిఏమైనా ఈసారి వెళ్లి డబ్బుతెచ్చివ్వటం తనకే మాత్రం ఇష్టంలేదు. అలా చెయ్యకపోతే జరగబోయే ఉపద్రవం కూడా తనకు తెలుసు. శరీరాన్ని పెట్లగొట్టి మనసును చిత్రవధ చేసి గుండెను తూట్లుపొడిచి దుర్భాషలాడతాడు. ఆ దృశ్యం తలుచుకుంటేనే ఒళ్లంతా గగుర్పొడిచి నీరసంతో నిస్పృహ కమ్మింది. తలంతా దిమ్మెక్కి సమ్మెటపోట్లు పొడిచినట్లుంది. అసహనంతో దిక్కుదారీ తోచని సంకీర్ణావస్థలో ఉండగా... లోగడ తాను ఉద్యోగావకాశాన్ని వదులుకుంటు న్నప్పుడు తనంటే అత్యంత ఆత్మాభిమానం కలిగివున్న మనోహర్ అన్న మాటలు.

"అపర్ణా! నీ మీద జాలితోను,

దయతోను నేను నీకీ ఉద్యోగం ఇవ్వటంలేదు. నీ మీదున్న అభిమానంతోనని నువ్వుగుర్తించగలిగితే అంతేచాలు. ఇప్పుడుకాదన్నా ఇంకెప్పుడు కావాలనుకున్నా నీ సీటు నీకప్పగిస్తాను. నిరభ్యంతరంగా నిస్సంకోచంగా రావచ్చు. ఓ.కే?'' గుర్తొచ్చి ధైర్యం తెచ్చిన తెగింపుతో క్షణాలమీద బయలుదేరి వెళ్లింది. తన నమ్మకం వమ్ము చెయ్యకుండా మనోహర్ తనిచ్చిన మాట ప్రకారం తనకోసం సీటు కేటాయించాడు. తిరిగి వచ్చి ఆ ఇంట్లో తనకు సంబంధించిన గుర్తంటూ ఏమీ మిగల్చకుండా సర్దుకుని ప్రయాణమైంది...

భార్య డబ్బుకోసమే వెళ్లిందని ఆమె రాకకోసం ఎదురుతెన్నులు చూస్తున్న మాధవ్‌కి మూడురోజుల తర్వాత పోస్ట్‌మాన్ బరువైన కవరు అందించివెళ్లాడు. ఆత్రంగా కవరు ఓపెన్‌చేసి మొదటి వాక్యం చదివి అదిరిపడ్డాడు. అంతవరకూ అతననుకుంటోంది ఆ ఉత్తరంలో డబ్బును గురించిన విషయం ఉంటుందని.

"మీ నుండి శాశ్వతంగా వీడ్కోలు తీసుకుంటున్న అపర్ణ... డబ్బువిషయం ఉంటుందని టెన్షన్‌తో ఫీలౌతున్న అతన్ని మొదటివాక్యం చెమటలు పట్టించింది. మనసు కీడు శంకించింది.

అపర్ణ ప్రాణం తీసుకునే అఘాయిత్యం చేసుకుందని కాదు.

పరువుతీసే పనేదైనా చేసిందేమోనని!

తన ప్రతిష్టను దెబ్బతీసే పనేదైనా చేసిందేమోనని!!

ఎవరితోనైనా లేచిపోయిందేమోనని!!!

ఎవరినైనా లేవదీసుకుపోయిందేమోనని!!!

ఆ ఒక్కక్షణంలో వేల దురాలోచనలు.

వివేకం కోల్పోయిన వేలాది దుర్మార్గపుటాలోచనలు.

ముఖానికి పట్టిన చెమటను హడావుడిగా కర్చీఫ్‌తో అద్దుకుని వణికే చేతుల్లోని ఉత్తరంలోకి దృష్టిని సారించా డు.

... ఈ క్షణంనుండీ నీకూ నాకూ ఎలాంటి సంబంధానుబంధాలూ లేవు. అందుకు కావాలసిన ఏర్పాట్లన్నీ చేస్తున్నాను. కారణం తెలుసుకుని ఆశ్చర్యంతో



## అతి తెలివి పిల్లలు

పిల్లలు ఈనాడు తెలివి మీరుతున్నారనటానికి నిదర్శనంగా ఈ మధ్యనే ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన స్కూలు పిల్లలు ఇద్దరు తమ అతి తెలివి తేటల్ని ప్రదర్శించారు. హిందీ పరీక్ష రోజున వాళ్ళు చదివిన ప్రశ్నలు రాలేదట!

దాంతో ఒకడేమో ఆన్సర్ పేపరుకు పది రూపాయలు, రెండోవాడేమో తాను బీదవాడిని అంత ఇచ్చుకోలేనంటూ అయిదురూపాయలు జతచేసి పరీక్షలో ప్యాస్ చెయ్యమని మాస్టార్ని అభ్యర్థించారట! అయితే ఆ మాస్టారు ఆ డబ్బుని తీసికొన్నా వారివిద్దర్నీ పరీక్షలో తప్పించేశారట!

—జూపిటర్

తల్లక్రిందులవకండి. కారణంచెప్పేముందు గతం ఒక్కసారి గుర్తుచేస్తున్నాను. కొన్ని నిజాలు మీ ముందుంచుతున్నాను.

పెళ్లంటే... శాశ్వతంలేని నోట్లకట్టలకు అతి విలువైన, పవిత్రమైన మాంగల్యాన్ని ఖరీదుకోసం వేలంపాటలో పెట్టి విక్రయించి వ్యక్తిత్వపు విలువల్ని దిగజార్చుకుని మగవాడినన్న అహంభావంతో అట్టహాసంగా, ఆర్భాటంగా దర్జాగా పెళ్లిపీటల మీద కూర్చుని దర్పంగా, గర్వంగా ఆడదాని మెడలో మూడుముళ్లూ వేసి శరీరాల కలయికతోనే మురిసిపోవటం కాదు. ఆమె భవితవ్యానికి మగవాడొక వేగుచుక్క కావాలి. ఆ వెలుగులో రాచరికం ఒలకబోస్తూ రాజహంసలా ఆమె జీవితం సాగిపోవాలి. విలువకట్టవలసింది ఆమె మెడలో కట్టే మాంగల్యానికి కాదు. పొందబోయే ఆమె మనసుకు. ముడి పడవలసింది ఆమె శరీరంతో కాదు. ప్రేమామృతాన్ని వర్షించే ఆమె హృదయంతో గెలుచుకోవలసింది ఆమెపై అధికారాన్ని కాదు. మమత నిండిన నిండుగుండెను వెలకట్టవలసింది డబ్బుతోకాదు. రాగబంధంతో, ఆమెకూ మనిషిగా ఒక సజీవమైన మనసుంటుందనీ దానికీ ఆత్మాభిమానంతో కూడిన స్పందన ఉంటుందనీ వ్యక్తిత్వంతో కూడిన ఇష్టాయిష్టాలుంటాయనీ మరచి ఒక జడ పదార్థంలా మార్చి అక్రమంగా, అమానుషంగా, ఘాతుకంగా హింసించి, వంచించి పశుప్రవృత్తితో అవసరానికి ఉపయోగపడే యంత్రంలా మనసును చంపి అవమానించటం కాదు. గౌరవించవలసింది మనిషిగా. మనసున్న మనిషిగా...

మీ జీవితంలో ఎన్నో కోర్కెల గూళ్లు కట్టుకుని ప్రవేశించిన నేను నిజమైన ఆనందానుభూతులు పొందిన సమయం దాదాపు శూన్యమనే చెప్పాలి. మన మధ్య ఉన్నది కేవలం డబ్బుకీ మనిషికీ ఉండే సంబంధం మాత్రమే. వివాహమైన చాలా త్వరలోనే మీ మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో పుష్కలంగా డబ్బుదాహమున్న సగటు భర్తగా తెలుసుకున్నాను. అయినా మీ మీదున్న భక్తిగౌరవాల వలన, ప్రేమానురాగాలు మీ నుండి పొందాలనే స్వార్థంవలన కూడా కావచ్చు. మీ అమానుష ప్రవర్తనకు తలవంచి అడిగినంత తెచ్చి అందించి వంచింపబడ్డాను. ఇన్నాళ్లూ మీ రాక్షస కృత్యాలనూ సహించి ఒక యంత్రంలామారి కాలం గడిపాను. అర్థం చేసుకుని అనురాగ ప్రవంతిలో ఓలలాడించే భర్త అడవిలోకి రమ్మన్నా వస్తుంది. అగ్నిలో దూకమన్నా దూకుతుంది ఆడది. అష్టైశ్వర్యాలతో కూడిన పట్టపురాణి కావాలని కాదు ఆడది కోరుకునేది. అచంచల ప్రేమానురాగాలు నిండిన హృదయ రాణికావాలని కలలు కంటుంది. నా విషయంలో ఆ కలలు కల్లలయ్యాయి. ఇక ముందు నాకా అవసరం, అభిప్రాయం కూడాలేవు. ఇద్దరం మనుషులుగా దగ్గరగా ఉన్నా మనసులు యోజనాల దూరంలోఉన్నాయి. శారీరకంగా ఒకటయినా మానసికంగా ఎడబాటులో ఉన్నాం. నా దృష్టిలో ఐహిక సుఖాలు భౌతిక విషయాలు మాత్రమేకాదు. మనసును

స్పృశించి మంచులా చల్లబరిచే మధురమైన ఆత్మీయతానురాగాలు. అవి మీ వలన నా జీవితానికెలాగూ లేవు గనుక నాకై నేను ప్రశాంతంగా విశ్రాంతిగా గడపటానికి నిర్ణయించుకున్నాను.

"ఇదంతా ఎలాసాధ్యం?" అనే ధర్మ సందేహం మీకు కలుగుతూంది కదూ? కాని పని, మీ పరువు ప్రతిష్టల్ని దెబ్బతీసే చెయ్యరానిపని చెయ్యటంలేదు. ఒక సహృదయుని అభిమానంతో ఉన్నతోద్యోగి నయ్యాను. నేనొక అఫీషియల్ పర్సన్‌ని అయ్యానని తెలిసి మీరు చెప్పబోయే తేనె పూరిత వాక్కులు నాకు తెలుసు.

"ఇక ముందు మనం హాయిగా కలిసి జీవితాన్ని పూలరథంలా సాగిద్దాం" అంటారు కదూ?

ఇప్పుడు మీ దృష్టిలో నేనొక బంగారు గుడ్లుపెట్టే బాతుని. ఇక మనం కలిసి ఉండటం తెగిన తాడుని అతుకు పెట్టిన ముడిలాంటిది. అంత తెగింపు, త్యాగబుద్ధి, ఓర్పు నాకిక లేవు. మిమ్మల్నీ, మీ మాటల్నీ నమ్మే స్థితి దాటిపోయాను. కాదు... దాటిపోయేలా మీరే చేశారు.

ఆకలికి అలమటించిపోతూ పాలుతాగుతున్న పులి తను ఆశించిన ఆహారం కంటబడగానే కండలు పీకి రక్తం పీల్చేస్తుంది గాని పాలతో తృప్తిపడదు. రేపటి మీ ప్రవర్తనా, నా పరిస్థితీ అంతే!

ఇన్నాళ్లా నా సహనానికి పరీక్ష పెట్టారు. నా ఓర్పుని అలుసుగా తీసుకున్నారు. అల్పజీవి అని పిల్లిని బంధించి అమానుషంగా ప్రవర్తిస్తే ఎదురుతిరిగి పులిలా మారుతుంది. ఇప్పుడు మనిద్దరం అదే పరిస్థితిలో ఉన్నాం. తీపి మాటల్తో నన్ను మభ్యపెట్టి మళ్లీ నన్ను లూటీ చేస్తారు. నిలువు దోపిడీ చేస్తారు. ఆ తరువాత... నా కండలు చీల్చి, నా రక్తం పీల్చి... అందుకే మీనుండి శాశ్వతంగా విడిపోవాలని సన్నాహాలుచేస్తున్నాను. మీ దృష్టిలో లోకం దృష్టిలో నేను డబ్బు అహంతో,



ధనమదంతో భర్తను త్యజించిన రాక్షసివే కావచ్చు. లేదా పతితవే కావచ్చు. ఎలా భావించినా నాకు బాధలేదు. కాని ఒక్కటి మాత్రం ప్రమాణికంగా చెప్పగలను. ఎక్కడవున్నా ఎలాంటి పరిస్థితిలో వున్నా నాకుసంబంధించిన ఏ ఒక్కరి పరువుప్రతిష్టలకు నీచమైన పని మాత్రం చెయ్యను. ఇక... మీరు నాకు అమ్మిన కానంత మాంగల్యం మీకే పంపుతున్నాను..." అప్పుడు చూచాడు కవరు తెరిచి పరిశీలనగా.

చేతులు వణికి అందులో పదిలపరచిన మాంగల్యం జారి నేలమీద పడింది.

పడుతూ ఓంకార శబ్దం చేసింది!

వణుకుతూ వంగి అందుకున్నాడు!

టన్నుల బరువు ఎత్తుకున్నట్లయింది!

పెద్దల సాక్షిగా, పంచభూతాల సాక్షిగా, పురోహితుల సాక్షిగా, అగ్ని సాక్షిగా వేద మంత్రాల ఘోషతో.

మూడుముళ్లూ వేసిన భార్య మెడలోని మాంగల్యం!

భార్యమెడలో ఉన్నంత కాలం విలువ కట్టలేక పోయిన మాంగల్యం!

దాని ఆధారంతో అనుక్షణం ఆమె మీద అధికారం చలాయించిన మాంగల్యం!

తన చేతిలో విశ్వరూపందాల్చి తనను అల్పుణ్ణి చేస్తూంది. స్వల్ప రూపుణ్ణి చేస్తూంది.

మోయలేనట్లు చూడలేనట్లు భరించలేనట్లు చప్పున గుప్పెట మూసి పిడికిలి బిగించాడు.

దృష్టి మరలా ఉత్తరంపై వాలింది.

"... నేటి ఆధునిక సమాజంలో ఒక నిర్భాగ్యురాలైన ఆడదాని జీవితం విలువ ఆత్మాహుతి. నేను ఆ స్థితిని కూడా దాటిపోయాను. ఎందుకంటే... నాకు మీ రూపురేఖలు సంతరించుకున్న కొడుకే పుడితే... వాణ్ని మనిషికి విలువనివ్వని డబ్బుకంటే మనసుకు విలువనిచ్చే మానవత్వంఉన్న మనిషిగా తీర్చిదిద్దుతాను. నిజమైన మనిషిగా సంఘంలో ఠీవిగా నిలబెడతాను. మానవత్వానికి ప్రతీకగా సగర్వంగా చాటుతాను. సంఘం సెహభాష్ అనేలా పెంచి మెప్పిస్తాను. అందుకోసమే బ్రతుకుతాను. బ్రతికి ఉంటాను. ఈ నా ఆశయం మీ దగ్గరుంటే నెరవేరదు. సాధ్యంకాదు. అన్నట్లు... మీకు తెలియదు కదూ?!

నాకు ఇప్పుడు నాలుగు నెలలు నిండాయి!!"

ఒక్కొక్క పదం ఒక్కొక్క శూలమై గుండెల్లో సూటిగా దూసుకుపోతూంటే ఉత్తరం పూర్తిగా చదివిన మాధవ్ ఏంచేయాలో తోచక పిచ్చెక్కిన వాడిలా జుట్టు పీక్కుంటున్నాడు...

*